www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 9 జులై 2023

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

కళాశాలలో నాడు-నేడు పనుల పరిశీలన

పనులు పరిశీలిస్తున్న సత్యనారాయణరెడ్డి

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో నాడు-నేడు పనులను శనివారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి ఎస్.సత్యనారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల్లో జరుగుతున్న పనుల వివరాలను ప్రిన్సిపల్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.సోమశేఖరరావు, గ్రంథాలయ అధికారి చక్రధర్, సచివాలయ ఇంజినీరింగ్ అధికారి దేవి, తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా వ్యవసాయ పనులు

- శివారు ప్రాంతాలకు సాగునీరు అందని వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి-మండపేట

గోదావరిలో నీటి మట్టం తగ్గడం, వర్షాలు కురవకపోవడం తదితర కారణాల నేపథ్యంలో శివారు ప్రాంతాలకు సాగునీరందకపోవడంతో మండపేట మండలంలో వ్యవసాయ పనులు మందకొడిగా సాగుతున్నాయి. రబీ సాగులో నారుమడుల దశ నుంచి రైతులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. పంట కాలువల్లో సమృద్ధిగా నీరులేకపోవడంతో రైతులు పవర్ టిల్లర్, ఇంజిన్ల సాయంతో కాలువల్లో నీటిని తోడుకుంటూ దమ్ములు చేసుకుంటున్నారు. అయితే పంట కాలువలు తూడు, గుర్రపు డెక్కతో నిండి ఉండడం, ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో శివారు ప్రాంత రైతులు సాగునీటి ఇబ్బందులు పడుతున్నారు.గత సార్వా ఆరంభంలో భారీ వర్షాల కారణంగా ఈఏడాది పంట ఆలస్యం ఇప్పుడు రబీ సాగు జాప్యానికి కారణమైందని రైతులు అంటున్నారు.అయితే నేటికి పూర్తిస్థాయిలో ఆకుమడులు పూర్తి కాలేదు. మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 6865 హెక్టార్లలో రబీ సాగు చేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. మండల పరిధిలోని ఆయకట్టుకు తాపేశ్వరం, నెంబర్ పన్, పాలతోడు, రామచంద్రుడు తదితర కాలువల ద్వారా సాగునీరు అందుతోంది. ఉప కాలువలు శివారు పంట బోదెల్లో సుమారు మూడు వంతులకు పైగా ఆక్రమణలతో బక్కచిక్కిపోయాయి.

డీజిల్ ఇంజన్ సాయంతో నీరు తోడుకుంటున్న రైతులు

వరి నాట్ల కోసం ట్రాక్టర్‌తో దమ్ము పనులు

ఆవాసాలకు దగ్గరలో ఉన్న కాలువలు చెత్త, వ్యర్థాలతో నిండిపోయాయి సాగునీటి ఎద్దడి ఏర్పడింది.మండలంలోని కేశవరం, ద్వారపూడి, వెలగతోడు, పాలతోడు, తాపేశ్వరం గ్రామాల పరిధిలో అధికంగా పంట బోదెలుకాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో ఆయా గ్రామాలపరిధిలోని శివారు భూములకు నీరు చేరడం కష్టంగా మారు తోంది. రామచంద్రుడు, తదితర కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులు సాగునీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పంట కాలువలో పడిపోయిన నీటి మట్టాలు

పంట కాలువల్లో నీటి మట్టం పడిపోవడంతో శివారు భూములకు నీరందక పనులు ముందుకు సాగడం లేదు. మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 6865 హెక్టార్లలో రబీ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడి, సార్వా మాసూళ్ల ఆలస్యం కావడంతోపనులు మందకొడిగా జరుగుతున్నాయి. పంట కాలువల్లో నీటిమట్టంతగ్గిపోవడంతో దమ్ములకు సైతం నీరు అందడం గగనంగా మారడంతో పనులు ముందుకు సాగడం లేదు.

ఆకుమడులు ఎండుతున్నాయని రైతుల ధర్నా

ఇటీవల మండలంలోని ఏడిద గ్రామంలో సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టుకు విద్యుత్ అంతరాయంతో నీరు అందకపోవడంతో ఆకుమడులు ఎండిపోతున్నాయని రైతులు సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. గత మూడురోజులుగా కరెంట్ లేకపోవడం, పూడికతీత చేపట్టంకసోవడంతో కాలువల ద్వారా నీరు అందకపోవడం, వర్షాలు కురవకపోవడంతో ఆకుమడులు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు.తక్షణం అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సాగునీరందించాలని మండపేట పట్టణ, మండల రైతులుకోరుతున్నారు.

రామచంద్రుడు కాలువలో చెత్త తొలగింపు

సాగునీరు అందక రైతులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కాలువలో తూడు చెత్తాచెదారం పనులు తొలగింపు పనులు చేపట్టింది. దీంతో గొలపుంత, బూరుగుపుంతలను ఆనుకుని ఉన్న సుమారు 200 ఎకరాలకు నిరంతరయంగా సాగునీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఇది ఇలా ఉండగా మోటర్ బోర్లు ఉన్నప్రాంతాల్లో ఇప్పటికి వరి నాట్ల పనులు పూర్తి అయ్యాయి.

నిరంతరాయంగా సాగు నీరు అందించాలి

దేశంలో వ్యవసాయం మీద ఎక్కువ మంది జీవనాధారం పొందుతున్నారని అటు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పడుతుంది. దీనికి ప్రధాన ఆధారమైన లస్కర్ వ్యవస్థ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఇప్పటికైనా అధికారుల స్పందించి నాణ్యమైన విద్యుత్తుతో పాటు పొలాలకు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలి.

- కె.కృష్ణవేణి,సిఐటియు జిల్లా కార్యదర్శి

సాగునీరు అందించేందుకు చర్యలుచేపట్టాలి

శివారు ప్రాంతాలకు సాగునీరు అందకపోవడంతో ఆకు మడులు ఎండిపోతున్నాయి. వర్షం వస్తే కొంతమేర నీరు అందేదని అయితే వర్షం కురవకపోవడంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. కాలువలో ఆక్రమణకు గురి కావడంతో సాగునీరు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం అధికారులు స్పందించి సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలి.

-ఎం.శ్రీనివాసు, కౌలురైతు, మండపేట

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి పినిపే విశ్వరూప్

ప్రజాశక్తి-అమలాపురం

రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, వైయస్సార్ యంత్ర సేవ, వైయస్సార్ ఉచిత పంటల బీమా వంటి పలు విప్లవాత్మక రైతు సంక్షేమ కార్యక్రమాల ద్వారా రైతులకు చేదోడు వాదోడుగా నిలుస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం జరిగిని నాలుగో ఏడాది వైఎస్ఆర్ ఉచిత పంటలు బీమా నిధుల విడుదల కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, పి.గన్నవరం ఎంఎల్ఎ చిట్టిబాబు, రాష్ట్ర దశ్యకళల అకాడమీ ఛైర్పర్సన్ కుడిపూడి సత్య శైలజ, పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, వక్ఫ్ బోర్డ్ ఛైర్‌పర్సన్ షేక్ అబ్దుల్ ఖాదర్ స్థానిక కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. తొలుత వైఎస్ఆం చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతర మంత్రి వాట్లాడుతూ దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతుల సంక్షేమాన్ని కాంక్షించి ఎన్నో అభివద్ధి కార్య ప్రవేశపెట్టారని, మరలా ఆయన తనయుడు, ప్రస్తుత సిఎం వైఎస్ జగన్ మరింత ముందు చూపుతో రైతు అభ్యున్నతిని కోరుతూ మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు నేడు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ వ్యవసాయం వాటి అనుబంధ రంగాలలోని ఆధునిక పోకడలు, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు దరిచేరితేనే సాంకేతికతకు సార్ధకత చేకూరుతుందని, ఆ దిశగా వ్యవ సాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులను ప్రోత్సహించాలన్నారు. వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని వైఎస్ఆర్ రైతు దినోత్సవం జరుపుకోవడం

పంటల బీమా అందజేస్తున్న మంత్రి విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షుశుక్లా

జరిగిందన్నారు వ్యవసాయ విస్తరణ సేవలు బలోపేతం, సాగులో మెలకువలను రైతులు తెలుసుకొని తక్కువ పెట్టుబడితో నాణ్యమైన లాభ సాటి ఉత్పత్తులు సాధించాలన్నారు. సహజ సిద్ధ వనరులతో ఆధునిక సేద్య విధానాలను అవలంబించాల న్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ 2022 ఏడాదిలో వైఎస్ఆర్ ఉచిత పంటలు బీమా కింద జిల్లాలో 25,229.5 ఎకరాల విస్తీర్ణంలో పంటలు నష్టపోయిన 28,686 మంది రైతు లకు సంబంధించి బీమా పరిహారం గా రూ.20,44,59,279 లు వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా మేలు జాతి వంగడాల విత్తనాలను వారు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు నాని బాబు, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, వ్యవసాయ సహాయ సంచాలకులు కె.నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-అమలాపురం

అల్లవరం మండలపరిషత్ హై స్కూల్ అల్లవరం నందు 1987- 88 బ్యాచ్ 35 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. ఈ కార్యక్రమంలో తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బసవ వరహాలు హాజరయ్యారు. ఈ బ్యాచ్ లో చదువుకొని ఎంఎల్‌సి అయిన బొమ్మి ఇజ్రాయెల్‌ను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రతి విద్యార్థి తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మొదటి ఆత్మీయ కలయిక సందర్భంగా కేక్ కట్ చేశారు. తమ పాఠశాలకు ఒక బీరువా బహుమతిగా ఇవ్వటం జరిగింది. ఇజ్రాయెల్ మాట్లాడుతూ పాఠశాల అభివద్ధికి తన వంతు సాయం చేస్తానని అన్నారు. రోడ్డు, టాయిలెట్స్, ఇంటర్ విద్యార్థులకు నోటు పుస్తకాలు ఇస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో పాల్గొన్న అల్లవరం హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కార్యక్రమంలో మంగళంపల్లి సుబ్రహ్మణ్యం, కడలి శివన్నారాయణ, కంకిపాటి గణపతి రామారావు, కంచెర్ల శ్రీనివాసరావు, కొల్లు వెంకటరమణ రాజాజీ, రుద్రరాజు సీతారామరాజు, కాండ్రేగుల బాల గంగాధర్ తిలక్, రుద్రరాజు ఉషాదేవి, ఆదుర్తి కష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గొంతు వాపు నివారణ టీకాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కుందూరు గ్రామంలో గొంతు వాపు నివారణ టీకాలు వేశారు. కె. గంగవరం మండల అధ్యక్షురాలు పంపన నాగమణి సుబ్బారావు శనివారం ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కొందూరు పరిసర ప్రాంత పశువులకు గొంతువాపు వ్యాధి రాకుండా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి కెవి.రామరాజు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ శిరీష, ఎహెచ్ఎ కుమారి కల్యాణి, ఎహెచ్ఎ శ్రీను, ఎహెచ్ఎ సురేష్, జిఎం నారాయణ, పాడి రైతులు పాల్గొన్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురం గ్రామంలో అధిక వేగంతో వెళుతున్న ఇసుక లారీలను శుక్రవారం రాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ ఇసుక లారీలు మితిమీరిన వేగంతో రాత్రి పగలు తేడా లేకుండా, ఇసుక స్టాక్‌యార్డు పేరుతో విచ్చలవిడిగా తిరుగుతున్న లారీలను గ్రామస్తులు అడ్డుకొని నిరసన చేశారు. ఏటిగట్టు రహదారి ఇరుకైన రోడ్డు కావడం అధిక లోడుతో ఇసుక లారీలు ఏటుగట్టుపై స్పీడుగా వెళ్లడంతో, ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి మీదుగా వాహనాలు నెమ్మదిగా వెళ్లాలని, దుమ్ము లేకుండా నీళ్లు చల్లాలని గ్రామస్తులు పలుమార్లు నిర్వాహకులకు చెప్పినా ప్రయో జనం లేకపోయిందని అన్నారు.

గ్రామానికి చెందిన పలువరు శుక్ర వారం రాత్రి రోడ్డు పైకి వచ్చి సుమారుగా గంట సేపు ఇసుకతో వెళ్తున్న టిప్పర్లు, లారీలను, నిలుపుదల చేశారు. టిప్పరు సామర్థ్యం 18 టన్నులు ఉండగా 34టన్నులతో అతివేగంతో వెళ్తున్నా అడిగే వారే లేరనా మీ ఇష్టానుసారంగా వాహనాలు నడిపితే ఎప్పుడు ఏ ప్రమాదాలు జరుగుతాయోనని భయపడి ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన తెలియడంతో అంగర ఎస్ఐ జి.చంటి గ్రామస్తులకు సర్ది చెప్పి ఇసుక రిచ్ నిర్వాహకులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిలుపుదల చేసిన లారీలను గ్రామస్తులు వదిలిపెట్టారు.

12న టిడిపి బస్సు యాత్ర

ప్రజాశక్తి - అంబాజీపేట

రాష్ట్ర టిడిపి ఆదేశాలతో పి.గన్నవరం నియోజకవర్గంలో ఈ నెల 12న చేపట్టే భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. శనివారం అంబాజీపేటలో వెంకటరాజు ఆయిల్ మిల్ ఆవరణలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు దంతులూరి శ్రీనురాజు అధ్యక్షతన మండల పార్టీ సమావేశం శనివారం జరిగింది. దాసరి మాట్లాడుతూ ఈనెల 12న అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమయ్యే భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర నేదునూరు, ముక్కామల లాకులు సెంటర్, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, కె.పెదపూడి మీదిగా అంబాజీపేటకు చేరుకుని అక్కడనుండి ముంగండ, పి.గన్నవరం మీదుగా వాడ్రేవుపల్లికి చేరుకుని వాడ్రేవుపల్లిలో ముగుస్తుందన్నారు. అంబాజీపేట మండల టిడిపి శ్రేణులు అనుబంధం సంస్థల ప్రతినిధులు 12న మధ్యాహ్నం మూడు గంటలకు ముక్కామల లాకుల సెంటర్‌కు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గూడాల ఫణి, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, అరిగెల బలరామమూర్తి,పబ్బినీడి రాంబాబు, జల్లి బాలరాజు, సరెళ్ళ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి** అయినవిల్లి మండలం టిడిపి నాయకులు మండల స్థాయి సమావేశం శనివారం మండల పార్టీ అధ్యక్షులు చిట్టూరి శ్రీనివాస్ చౌదరి అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర టిడిపి రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం భవిష్యత్ గ్యారంటీ అనే నినాదంతో చేస్తున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు కార్యక్రమంలో అధిక సంఖ్యలో మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, టిడిపి మాజీ ఎంపీపీ సలాది పుల్లయ్య నాయుడు, దళితరత్న నేదునూరి వీర్రాజు, టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు బడుగు భాస్కర జోగేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసనను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మండపేట

సిఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరుతూ కలెక్టర్ల కార్యాలయం వద్ద ఈనెల 10,11 తేదీలలో చేపడుతున్న అంగన్‌వాడీల నిరసనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి పిలుపునిచ్చారు. శనివారం మండపేటలో నిరసనకు సంబంధించిన పోస్టర్ ను అంగన్‌వాడీలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు తెలంగాణా కంటే అదనంగా వేతనాలు పెంచాలిని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాడ్యూటీ ఇవ్వాలని, అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంచాలని, వేతనంలో సగం పెన్షన్ గా ఇవ్వాలని, 300 జనాభా దాటిన మినీ సెంటర్ ను మెయిన్ సెంట్రర్గా మార్చి మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జూలై 10, 11 తేదీలలో అమలాపురం కలెక్టరేట్ వద్ద జరిగే 36 గంటల నిరసన శిబిరంలో జిల్లా అంగన్‌వాడీలంతా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముమ్మిడివరంలో సమావేశంలో మాట్లాడుతున సిఐటియు నాయకులు

విజయవంతం చేయాలని పిలుపు

ముమ్మిడివరం అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం జులై 10,11 తేదీలలో 36 గంటల దీక్షా విజయవంతం చేయాలని శనివారం ముమ్మిడివరం ప్రాజెక్ట్ ముఖ్య నాయకులు సమావేశం స్థానిక సిఐటియు ఆఫీస్ వద్ద జరిగింది .ఈ సమావేశానికి ప్రాజెక్ట్ కార్యదర్శికె. వెంకటలక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి జి దుర్గాప్రసాద్ ప్రతినిధులుగా పాల్గొని జూలై 10 ,11 తేదీల్లో 36 గంటల దీక్షను ప్రాముఖ్యతను వివరించారు. 36 గంటలు నిరసనను ఎపి అంగన్‌వాడీ వర్కర్ హెల్పర్ యూనియన్, సిఐటియు పిలుపుల ఇచ్చిందన్నారురు. అంగన్‌వాడీ వర్కర్ హెల్పర్స్, మినీ వర్కర్లు పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.హైమావతి, జి.అనంతలక్ష్మి, ఉష, టి.శ్రీదేవి, మహేశ్వరి, జయలక్ష్మి , మంగయమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

చిన్నారికి వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజోలు

ఇటీవల అనారోగ్యంతో బాధ పడుతూ బ్రెయిన్ సర్జరీ చేయించుకున్న రాజోలు మండలం గాంధీ నగర్ కు చెందిన చిన్నారి పలివెల బ్లెస్సీకి వసుధ ఫౌండేషన్ శనివారం ఆర్థిక సాయం అందజేసింది. హైదరాబాద్ 'వసుధ పౌండేషన్' ద్వారా రాజోలు నియోజకవర్గం వసుధ పౌండేషన్ కన్వీనర్ జంపన బుజ్జిరాజు చేతులు మీదగా రూ.20వేలు చిన్నారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో వసుధ పౌండేషన్ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో బోనంరాజు, అటారం మాస్టర్, తెన్నేటి కిషోర్, స్టార్ శ్రీను పలువురు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

వైఎస్ఆర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-యంత్రాంగం

మాజీ సిఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని జిల్లాలో శనివారం వైఎస్సార్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు వైఎస్ఆర్ జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

రామచంద్రపురం వైఎస్ఆర్ జయంతి పట్టణం లో రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి మంత్రివేణు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల గుండె చప్పుడు వైఎస్ఆర్ అని అన్నారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ పండు గోవిందరాజు, వైసిపి నాయకులు పెట్టా శ్రీనివాస్ రావు, ఎంపిపి అంబటి భవాని, మున్సిపల్ ఛైర్మన్ గాదంసెట్టి శ్రీదేవి, జెడ్‌పిటిసి సభ్యురాలు వరలక్ష్మి, కె.గంగవరం ఎం పి పి పంపన నాగమణి తదితరులు పాల్గొన్నారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా వెంకటాయపాలెంలో వైఎస్ఆర్ విగ్రహాని సర్పంచ్ యల్లమిల్లి సతీష్ కుమారి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా జెడ్‌పిటిసి సభ్యుడు మేరిడి వెంకటేశ్వరరావు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎపి ఐడిసి డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, సచివాలయ కన్వీనర్ లు, యనమదల గోవిందరాజు, దడాల రవికుమార్, వైస్ సర్పంచ్ గంధం బుజ్జి, మాజీ సర్పంచ్ పిల్లి రాంబాబు, కాదా శ్రీను, మంద పల్లి మోషే తదితరులుపాల్గొన్నారు. **మండపేట** స్థానిక రాజారత్న జంక్షన్ లోని వైఎస్ఆర్ విగ్రహానికి మండపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైసిపి రాష్ట్ర నాయకులు పట్టాభి రామయ్య చౌదరి, రెడ్డి రాజబాబు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణిలు, బాలింతలు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, వైసిపి నాయకులు ముక్కా సుబ్రహ్మణ్యం, ముక్కా దాలయ్య, మొండి మురళి తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** మండలంలో పలు గ్రామాల్లో వైఎస్ఆర్ జయంతినివైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, పార్టీ నాయకులు మట్టపర్తి పాలరాజు తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** చెముడులంకలో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, ఆలమూరులో సర్పంచ్ ఎన్.లావణ్య కుమార రాజా, పెద్దపల్లలో నెక్కంటి వెంకట్రాయుడు, జొన్నాడలో ద్వారంపూడి దొరబాబు, నాంధ్ర నాగమోహన్‌రెడ్డి, గుమ్మిలేరులో సర్పంచ్ గుణ్ణం రాంబాబు, చొప్పెల్లలో సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపనయ్య, చింతలూరులో నామాల శ్రీనివాసు తదితరుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం చొప్పెల్ల పిహెచ్‌సిలో గర్భిణులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే ఆయా గ్రామాల్లో వైఎస్ఆర్ జయంతికి వివిధ రకాల పండ్ల జాతి మొక్కలను నేతలు నాటారు. కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. **అమలాపురం** అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆనంతరం మంత్రి మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పినిపే శ్రీకాంత్, ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణరావు, జెడ్‌పిటిసి సభ్యుడు పందిరి హరి, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట** వైఎస్ఆర్ జయంతిని పార్టీ శ్రేణులు మండల పరిధిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో మండల స్థాయి వైసిపి నాయకులు వైఎస్ఆర్ పూలమాలు వేసి నివాళులర్పించారు. **కాట్రేనికోన** మండల పరిధిలోని పల్లంకుర్రు, కందికుప్ప, గెద్దనపల్లి, కాట్రేనికొన, ఉప్పుడి, పెనుమళ్ళ, చెయ్యేరు అగ్రహారం, చెయ్యేరుతో పాటు అన్ని గ్రామాల్లో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. కాట్రేనికోన మెయిన్ రోడ్డు బ్రిడ్జి వద్ద గల వైఎస్ఆర్ విగ్రహానికి మండల వైసిపి అధ్యక్షులు నల్లా నరసింహ మూర్తి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. పల్లంకుర్రు గ్రామ సర్పంచ్ నాతి అలివేలు సత్యనారాయణ అధర్వంలో బస్ స్టాండ్ వద్ద వైఎస్ఆర్ జయంతి నిర్వహించారు. కందికుప్ప సెంటర్‌లో సర్పంచ్ చల్లగళ్ల వెంకట లక్ష్మీ అప్పారావు, గ్రామ కమిటీ అధ్యక్షులు యేడిద లక్షణ రావు పర్యవేక్షణలో వైఎస్ఆర్ విగ్రహం దగ్గర కేకు కట్ చేశారు. కార్యక్రమలలో ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కాశి హనుమంత రావు, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ నల్లా బేబీ జానకి, మండల మహిళా అధ్యక్షురాలు మోకా చంద్ర నాగరత్నం, సొసైటీ అధ్యక్షులు జగడం బాలయోగి అక్కల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో రాష్ట్ర మంత్రి వేణు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేస్తున్న దృశ్యం

వెంకటాయపాలెంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామస్తులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బోడసకుర్రులో 'స్వచ్ఛ పక్వాడ '

ప్రజాశక్తి-అమలాపురం

అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామపంచాయతీ పరిధిలో గౌతమి నగర్ నందు శనివారం గెయిల్ ఇండియా లిమిటెడ్ తాటిపాక వారి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి సమక్షంలో స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గెయిల్ ఇండియా లిమిటెడ్ వైద్య సంచార వాహనం ద్వారా మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అనంతరం గ్రామ సర్పంచ్ రొక్కల విజయలక్ష్మి చేతుల మీదుగా డ్వాక్రా మహిళలకు గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాటిపాక గెయిల్ ఇండియా లిమిటెడ్ ఇంచార్జ్ చీఫ్ మేనేజర్ రాంబాబు, డేవిడ్, డ్వాక్రా యానిమేటర్ నక్క బేబీ కుమారి, పాలకవర్గ సభ్యులు బొంతు పల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

దగ్ధమైన బైకులు

బైకులు ఢీకొని వ్యక్తి సజీవ దహనం

ప్రజాశక్తి-అన్నవరం (తొండంగి)

తొండంగి పోలీస్ స్టేషన్ పరిధిలో కత్తిపూడి రిఫరల్ ఆసుపత్రి సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద రెండు బైకులు ఢీకొని ఒకరు సజీవ దహనం కాగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. తొండంగి మండలం ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన వెలుగుల చక్రరావు (65) టివిఎస్ ఎక్సెల్‌పై కత్తిపూడి రిఫరల్ బంకు వద్దకు వచ్చి క్యాన్‌లో పెట్రోల్ పోయించుకుని తన ఊరు వెళ్లిపోయేందుకు రోడ్డు దాడుతున్నాడు. ఇంతలో కత్తిపూడి నుండి బెండపూడి వైపునకు పెనుమాలు గంగిరెడ్డి బైకుపై వచ్చి చక్రరావు బండిని ఢీకొన్నాడు. పెట్రోలు మండిపోవడం వల్ల రెండు బైకులూ దగ్ధమయ్యాయి. చక్రరావు అక్కడికక్కడే సజీవ దహనమయ్యాడు. తీవ్రంగా గాయపడిన గంగిరెడ్డిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. తొండంగి ఎస్ఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఆత్రేయపురం

పురుగుల మందు తాగి వృద్ధుడు మరణించిన చెందిన సంఘటన మండలంలోని ర్యాలి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వేల్పూరి వెర్రియ్య (70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. శనివారం ఇంటిలోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు.

బంగారం, నగదుచోరీ

ప్రజాశక్తి -ఆత్రేయపురం

25 కాసుల బంగారం, కేజీ పావు వెండి, రూ.లక్ష నగదు చోరీ జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు కట్టుంగ గ్రామానికి చెందిన పచ్చిగోళ్ల శ్రీనివాసరావు అనారోగ్యంగా కారణంగా తన భార్య మంగతాయారును తీసుకుని రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి శనివారం రాత్రి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులకు వేసిన తాళాలు బద్దలు కొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తలుపులు తెరిచి ఉంది. బంగారం, వెండి, నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. సిఐ రజినీ కుమార్, ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం రప్పించి వేలిముద్రలు సేకరించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

కొత్త ఎర్రవరం వద్ద నిర్మాణంలో ఉన్న జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ పనుల్లో విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందినట్టు ఏలేశ్వరం ఎస్‌క్మి జి.సతీష్ తెలిపారు. కాంక్రీట్ పనుల నిమిత్తం కిర్లంపూడి మండలం వీరవరం గ్రామం నుంచి 9 మంది కార్మికులు కొత్త ఎర్రవరం వచ్చారు. పిల్లర్ రేకులు అమర్చే పనిలో భాగంగా ముగ్గురు కార్మికులు పైకి ఎక్కారు. పైన 11 కెవి.విద్యుత్ వైర్లు తగిలి కొప్పన దైవానందం (57) వెలుగుల అప్పలరాజు, పెనమరెడ్డి వీర గణేశ్వరరావు తీవ్ర గాయాలు పాలయ్యారు. వీరిని ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే దైవానందం మృతి చెందాడు. మరో కార్మికుడు వెలుగుల అప్పలరాజు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు.

సారా స్వాధీనం, బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం, అన్నవరం, గండేపల్లి

పెద్దాపురం ఎస్ఇబి స్టేషన్ పరిధిలో సిఐ కెవి.స్వామి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన దాడుల్లో పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు సిఐ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో సారా అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. తొండంగి మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో బుచ్చియ్యపేటలో సారా బట్టీలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో 200 లీటర్ల బెల్లపు ఉటను ధ్వంసం చేశారు. గండేపల్లి మండలంలోని ఎన్ టి రాజాపురం శివారు అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై సిఐ సూర్య అప్పారావు, పోలీసులు దాడులు నిర్వహించారు. 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

ఉపాధి కూలీకి పాముకాటు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

మండలంలోని పవర గ్రామంలో శనివారం ఉపాధి పనులు చేస్తున్న మహిళా కూలీ పాముకాటు గురవడం గురవడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. మండల ఉపాధి హామీ ఎపిఒ ప్రభాకర్ అందించిన సమాచారం ప్రకారం మేజర్ కాలువలో శనివారం. మేరీ సుందరి ఉపాధి పనులు చేస్తుండగా పాముకాటుకు గురయ్యింది. ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి- జగ్గంపేట రూరల్

మండలంలోని జె.కొత్తూరులో టిడిపి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జె.కొత్తూరు టిడిపి యువ నేత బద్ది సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి పైడిపాల సూరిబాబు, మల్లిసాల సర్పంచ్ సర్వసిద్ధి లక్ష్మణరావు, సియాదుల సింహాచలం, యూనిట్ ఇన్‌ఛార్జి కేసిరెడ్డి శ్రీను, చల్లా రామ్మూర్తి, టిడిపి ప్రెసిడెంట్ చింతల కన్నారావు, నకిరెడ్డి సూర్యావతి పాల్గొన్నారు.

ధరల మోత.. విద్యుత్ వాత..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఒక వైపు కూరగాయల ధరలు... మరో వైపు నిత్యావసర సరుకుల ధరలు కొనుగోలు దారులకు చుక్కలు చూపిస్తున్నాయి. కిలో టమోటా రూ.150కి చేరిన విషయం విదితమే. ప్రభుత్వం రైతు బజార్లలో రూ.50కే కేజీ అంటూ చేసిన ఆర్భాటపు ప్రచారాలు నేతి బీర చందంగా మారాయి. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో సైతం ప్రారంభించిన రెండో రోజు నుంచే అత్యధిక రైతు బజార్లలో సబ్సిడీ టమోటాలు కనుమరుగయ్యాయి. దీంతో కొనుగోలు దారులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు. అల్లం కేజీ మూడు నెలల క్రితం రూ.100 కాగా ప్రస్తుతం రూ.250కి చేరింది. వెల్లుల్లి పాయలు రూ.90 నుంచి రూ.150కి చేరాయి. కూరగాయాలు కేజీ కొనుగోలు చేయాలంటే ఏరకమైనా రూ.50పై మాటే. మరో వైపు బియ్యం ధరలు ఇప్పటికే పెరిగి ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. బియ్యం ధరల పెంపునకు కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న జిఎస్‌టి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావటంతో గ్రామాల్లో మధ్య తరగతి, దినసరి కూలీలు, చిరుద్యోగులు కు ఇప్పుడిప్పుడే ఉపాధి లభిస్తోంది. ఆదాయానికి మించి నిత్యావసర ఖర్చులు పెరగడం ఆందోళనకు గురి చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో వడి వడిగా నాట్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల సమస్యలపై చిత్తశుద్ధి కొరవడిందనే అభిప్రాయం రైతులలో వ్యక్తమవుతోంది. వ్యవసాయ రంగంలో కీలక భూమిక పోషించే జలవనరులను నిల్వచేసుకునేందుకు అవకాశాలు ఉన్నా ఆ దిశగా దృష్టి సారించటం లేదు. నిధులు లేక అనేక ప్రాజెక్టులు నీరసించి పోతున్నాయి. పోలవరం నిధుల కేటాయింపులపై కేంద్రం మొండి చేయిచూపిస్తున్న విషయం విధితమే. మరో వైపు కాటన్ బ్యారేజీ ఎగువన డ్రెడ్జింగ్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ లోపించింది. ముందస్తు పేరుతో జూన్1 నుంచి కాల్వలకు నీరు విడుదల చేసి రైతులు సిద్ధం కావాలంటూ ప్రకటనలు గుప్పించింది. రైతు భరోసా, యంత్ర సేవ పేరుతో రైతు గ్రూపులకు ట్రాక్టర్లు ఇతర ఉపకరణాలు అందజసి ఆర్భాటంగా ప్రచాచానికి పూనుకుంది. రైతులకు శాశ్వత ప్రయోజనాలిచ్చే అంశాలపై దృష్టి సారించకపోవటం చిత్తశుద్ధి లేమిని దర్పణం పడుతోంది. మరో వైపు ఏటా పెరుగుతున్న ఎరువులు, పురుగుల మందుల ధరలకు కళ్లెం వేయటం లేదు. దీంతో సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. మరో వైపు కౌలు రైతులకు సాయం అందించే పరిస్థితులు లేవు. సాగు ప్రారంభం అవుతున్న ప్రస్తుత తరుణంలో పెట్టుబడులకు నగదు అందజేసి చిత్తశుద్ధి నిలుపుకోవాల్సిన అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సిసిఆర్‌సి కార్డుల మంజూరులో నిబంధనలు సడలించి అందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గతేడాది ముందస్తు సాగు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. గోదావరి వరదల కారణంగా అనేక పంటలు నేలమట్టం అయ్యాయి. కాల్వల ఆధునీకరణ, పూడికతీతలు లేకపోవటమే ఈ దుస్థితి కారణమని గత అనుభవాలు చెబుతున్నాయి. ఈ ఏడాది కూడా ఆధునీకరణ పనులు చేపట్టకపోవటం పాలకుల తీరును విమర్శల పాల్జేస్తుంది.

విద్యుత్ శాఖ సర్దుపోటు

సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ శాఖ వినియోగదారుల నడ్డి విరుస్తోందని సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యుత్ ఛార్జీలు ఏడాదికి ఒకటి లేదా రెండుసార్లు పెరుగుతూనే ఉన్నాయి. ట్రూ అప్, అడిషనల్ ఛార్జీలు రక రకాల పేర్లతో గోళ్లూడపీకుతోంది. గతంలో ఎవరో వినియోగించిన కరెంటుకు ఇపుడు మేం ఎలా కడతామనే ప్రశ్న అద్దెదారుల నుంచి వ్యక్తమువుతోంది. విద్యుత్ శాఖ నుంచి ఈ ప్రశ్నకు సమాధానం లభించడం లేదు. బిల్లులు చెల్లించకపోతే ఫీజులు తొలగిస్తామంటూ హెచ్చరికలు జారీ చేసి మరింత భయాందోళనలకు గురి చేస్తున్నారు. ఒక వైపు నిత్యావసర సరకుల ధరలు, పన్నుల భారాలు ఆకాశాన్నంటుతున్న విషయం విదితమే. సర్దుపోటుపై పాలనా యంత్రాంగం పునరాలోచించుకోపోతే మూల్యం చెల్లించుకోక తప్పదనే పలువురు హెచ్చరిస్తున్నారు.

పొంచి ఉన్న సీజనల్ ముప్పు

వాతావరణంలో మార్పుల నేపథ్యంలో సీజనల్ జ్వరాల ముప్పు పొంచి ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జూన్ చివరి వారం వరకూ జిల్లావ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైన విషయం విదితమే. 43 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవడంతో ఉక్కపోత..ఉమ్మదీతతో ప్రజలు అల్లాడిపోయారు. తాజాగా వర్షాలు ప్రారంభంఅయ్యాయి. వేసవి గాల్పులతో మగ్గిపోయిన ప్రజానీకానికి తాజా వర్షాలు కొంత ఊరటనిచ్చినప్పటికీ ఆరోగ్య సమస్యలు ముందుకొస్తున్నాయి. జలుబు, దగ్గు, జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి 30 కుటుంబాలలో ఒకరు ఈ తరహా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జిల్లా కేంద్రమైన ప్రభుత్వ ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. పిహెచ్‌సిల్లో కూడా మెరుగైన సేవలందించాలని రోగులు కోరుతున్నారు.

యానాం వార్తలు

అమిత్‌షాను కలిసిన అశోక్

అమిత్ షాను కలిసిన ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఢిల్లీ పర్యటనలో భాగంగా శనివారం కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షాను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా యానాం సమస్యలను ఆయనకు వివరించారు. ఎంఎల్ఎ అశోక్ వెంట పుదచ్చేరి అసెంబ్లీ స్పీకర్ సెల్వం ఉన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి - యానాం

మాజీ సిఎం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా సమాచార శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బొటానికల్ గార్డెన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి ఇఇ వీర సెల్వం, ఎస్‌పి రఘునాయిగం, మల్లాడి శామ్యూల్, గిడ్ల చంద్రరావు, మాజేటి సత్యభాస్కర్, గూటం శివ గణేష్ పాల్గొన్నారు.

ఐటిఐ కోర్స్ అభ్యర్థులకు 10న కౌన్సెలింగ్

ప్రజాశక్తి - యానాం

స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ ద్వారా వైర్‌మ్యాన్, మెకానిక్ మోటార్ వెహికల్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10న సోమవారం ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చింతపల్లి కష్ణ సుధాకర్ తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని ఐటిఐ కళాశాలకు రావాలన్నారు.

విఆర్ఎ ఆధ్వర్యాన వృత్తి విద్య నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట శివారు విలేజ్ రీకన్స్ట్రక్షన్స్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ యువతకు వత్తి విద్య నైపుణ్య శిక్షణలో భాగంగా మొదటి బ్యాచ్‌కు శనివారం శిక్షణ ప్రారంభించారు. జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న ఐదు గ్రామాల్లో ఇర్రిపాక, కాట్రావులపల్లి, గుర్రంపాలెం, ముల్లేరు, కలిజోల ప్రాంతాల్లో టైలరింగ్ శిక్షణ కోసం 84 మంది స్త్రీలకు కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభించినట్టు చెప్పారు. జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న సుమారు 20 గ్రామాల్లో పేద విద్యార్థుల కోసం సాయంత్రం ట్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్టు తెలపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎఫ్ఆర్ వేళాంగిణి రాజు, ప్రాజెక్టు ఆఫీసర్ షీలా శ్రీనివాస్, ఎన్.సుధాకర్, నాగరాజు, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విజయ్ కుమార్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-సీతానగరం

చినకొండేపూడి గ్రామంలో రాజమహేంద్రవరం సాయి ఆసుపత్రి అధినేత కురుకూరి విజయ కుమార్ నానమ్మ నాగరత్నం ఇటీవలే మతి చెందారు. శనివారం విజయ్ కుమార్ కుటుంబ సభ్యులను రాజానగరం నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ తో పాటు గద్దె సురేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌కూ తప్పని అగచాట్లు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం మండలంలోని రమణయ్యపేట-జె.అన్నవరం రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణం కష్టతరంగా మారింది. ఏజెన్సీ ప్రాంతమైన అడ్డతీగల, రాజఒమ్మంగి, వై.రామవరం, గంగవరం మండలాల గిరిజనులు మైదాన ప్రాంతాలకు వెళ్లాలంటే ఏలేశ్వరం రావాల్సిందే. గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే రహదారి చిన్నాభిన్నం కావడంతో రోజూ ఏదో వాహనానికి మరమ్మతులు తప్పడం లేదు. గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రి నుండి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలేశ్వరం, ప్రత్తిపాడు, కాకినాడ వంటి ప్రాంతాలకు గిరిజనులను అనునిత్యం అంబులెన్స్ ద్వారా తరలిస్తుంటారు. రహదారి ఛిద్రం కావడంతో అంబులెన్సులు కూడా రావడం ఇబ్బంది కరంగా మారింది. రోజూ ఏదో వాహనం మరమ్మతు రావడం, దిగబడి పోవడంతో ట్రాఫిక్ తీవ్ర అంత రాయం ఏర్ప డుతుంది. ఇప్పటికైనా రహదారి నిర్మాణాలకు ఉన్న అడ్డంకులు తొలగించి నిర్మాణాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దిగబడిపోయిన అంబులెన్స్

తాగునీటి సమస్యకు పరిష్కారం

తాళ్లరేవు : ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ చొల్లంగిపేట పంచాయితీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ఒఎన్‌జిసి నిధులు రూ.30 లక్షలతో ఎస్‌సి పేటలో నిర్మించిన వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించిన సందర్భంగా సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఎంఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నా రాయణ, స్థానిక సర్పంచ్ కందిళ్ల గంగాభవాని, ఎంపిటిసి కడియాల మహాలక్ష్మి, మాజీ సర్పంచ్ హరిబాబు, పెట్ల సూర్యనారాయణ రాజు, రేవు మల్లీశ్వరి, వైసిపి నాయకులు, కె.గోవింద్ కుమార్, ఆర్.గంగాధర్ పాల్గొన్నారు.

కరిబండి విద్యార్థుల ప్రతిభ

తాళ్లపూడి: నన్నయ విశ్వ విద్యాలయం డిగ్రీ మొదటి మూడవ సెమిస్టర్ ఫలితాల్లో తాళ్లపూడిలోని కరిబండి సుబ్బారావు మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ గ్రేడులు సాధించారని కళాశాల డైరెక్టర్ కరిబండి త్రినాథ స్వామి శనివారం తెలిపారు. మొదటి సంవత్సరం బిఎస్‌సిలో కె.అమూల్య 9.6, జి.లక్ష్మీ ప్రసూన 9.1, బికాంలో జె.ప్రసన్న 8.4, రెండవ సంవత్సరం బికాంలో వి.జ్యోతి 9.0, బిఎస్‌సిలో ఎస్.సత్య రమ్య 9.1, పి.శ్రీలక్ష్మి 8.6 గ్రేడులు సాధించాలని త్రినాథ స్వామి తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రయాణ సమయంలో రైళ్ళలో అగ్ని ప్రమాదాలు విషయంలో ఉద్యోగులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. శనివారం రైల్వే ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులకు భద్రతా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో రైళ్ల నిర్వహణ, ప్రయాణికుల భద్రతకు సంబంధించి పలు విషయాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. రైళ్లలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా స్పందించాలి, ప్రయాణికులను ఎలా దైర్య పరచాలి, వాటిని ఏ విధంగా నివారించాలనే అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశానికి రైల్వే ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కెవి.గిరి, స్టేషన్ సూపరింటెండెంట్లు శ్రీధర్, శ్రీదేవి, అనంతలక్ష్మి పలువురు స్టేషన్ మాస్టర్లు, పాయింట్స్ మాన్‌లు పాల్గొన్నారు.

చొల్లంగిపేటలో వైసిపి గడపగడపకు..

ప్రజాశక్తి - తాళ్లరేవు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఇబ్బందిగా ఉన్నాయని చెప్పడంతో వెంటనే వారు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఎఇని ఎంఎల్ఎ ఆదేశించారు. గ్రామంలో ఆకతాయిలు కుళాయి కనెక్షన్లు తొలగించారని చేసిన ఫిర్యాదుపై వెంటనే కుళాయి కనెక్షన్ పునరుద్ధరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మారుతీరావును ఎంఎల్ఎ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత గంగాధర్, స్థానిక సర్పంచ్ కందిళ్ల గంగాభవాని, గంగబాబు, టిల్లపూడి నాగేశ్వరరావు, కొపనాతి నాగరాజు, మైదు హరిబాబు, కె.శ్రీనివాస్, గంపల నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కె.గోవింద్ కుమార్, ఆర్.గంగాధర్, యానిమేటర్లు పాల్గొన్నారు.

గడప గడపకూలో ఎంఎల్ఎ పొన్నాడ

19వ వార్డులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-నిడదవోలు

ఇటీవల టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన మహానాడులో చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను కరపత్రాలు పంచుతూ ప్రజలకు టిడిపి నాయకులు పట్టణంలో ఎన్‌టిఆర్ కాలనీ 19వ వార్డులో శనివారం వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. నిడదవోలు నియోజకవర్గ టిడిపి నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ, నిడదవోలు పట్టణటిడిపి మాజీ అధ్యక్షులు గూడపాటి వెంకట్రావు, నాయకులు వాకలపూడి వెంకటరత్నం , నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు అంబటి వెంకటరమణ, తెలుగు యువత మాజీ అధ్యక్షులు ఎస్‌కె.బాబు, గుడ్ల బుజ్జి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో అందరికీ న్యాయం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల మేనిఫెస్టో అమలుతో అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతుందని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ', 'వస్తున్నా- మీ గ్రామానికి - మీ అనంతలక్ష్మి' 9వ రోజు కార్యక్రమంలో భాగంగా శనివారం పార్టీ నాయకులతో పెనుమర్తి గ్రామంలో పర్యటించారు. ఇంటింటా ప్రచారం చేశారు. ఈ పెంకే వీరబాబు, మట్టా ప్రకాష్ గౌడ్, సరిదే నాగ హరినాథ్, కాకరపల్లి కృష్ణ, వాసంశెట్టి సత్తిబాబు, బీమాబత్తుల సత్యనారాయణ, కాళ్ల శ్రీను, గుబ్బల సత్తిబాబు, చొక్కా జగన్, గుబ్బల శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

రైతులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తుందని కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పేర్కొన్నారు. స్థానిక రూరల్ మండలం, రమణయ్యపేట ఎంపిడిఒ మీటింగ్ హాల్లో రైతు దినోత్సవం సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ పశు నష్ట పరిహారం పథకం ద్వారా లబ్ధిదారులకు నష్ట పరిహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రైతులకు సంబంధించి పాడి గేదెలు, ఆవులు, గొర్రెలు మేకలు ప్రమాదవశాత్తు లేదా అకస్మాత్తుగా చనిపోతే డాక్టర్ వైస్సార్ పశు నష్టపరిహారం పథకం కింద నగదు అందించి బాధితులను ప్రభుత్వం ఆదుకుంటోందని చెప్పారు.

పాస్‌పోర్టు పడిపోయినది

కాకినాడ జిల్లా, రౌతులపూడి మండలం, గిడజాం గ్రామానికి చెందిన సుంకర గంగారావు, తండ్రి: గవర్రాజు అను నేను ది.02-11-2022వ తేదీన గిడజాం నుండి కత్తిపూడి ఆటోలో ప్రయాణం చేస్తుండగా మార్గం మధ్యలో నాయొక్క పాస్‌పోర్టు, బట్టలతో కూడిన బ్యాగు పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. నాయొక్క పాస్‌పోర్టు నెం. **B0435482.** పై నెంబరు గల పాస్‌పోర్టు ఎవ్వరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

సుంకర గంగారావు
తండ్రి: గవర్రాజు, డో.నెం.2-49,
గిడజాం గ్రామం, రౌతులపూడి మండలం,
కాకినాడ జిల్లా, పిన్: 533 406.
సెల్: 94930 61490

గ్రంథాలయాల్లో పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి-గోపాలపురం

గ్రంథాలయాలు ద్వారా విజ్ఞానానికి అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ చెర్ల పద్మశ్రీ అన్నారు. శనివారం గోపాలపురం శాఖ గ్రంథాలయాన్ని సందర్శించారు. గోపాలపురం గ్రంథాలయ శాఖలో రికార్డులు, పుస్తకాల వివరాలు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో జ్ఞాన సంపద కు అవసరమయ్యే పుస్తకాలను అందుబాటులో ఉండాలని, అవసరమైన వాటి వివరాలు తెలియజేస్తే వాటిని ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. అనంతరం ఇటీవల గోపాలపురం గ్రామానికి చెందిన దేవరపల్లి లైబ్రేరియన్ కెవిబి.ప్రసాద్ ఆకస్మికంగా మరణించారు. ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం నుంచి రావలసిన బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు వీరి వెంట గోపాలపురం లైబ్రేరియన్ సత్యనారాయణ, చాగల్లు లైబ్రేరియన్ గద్దె శ్రీనివాసు, స్థానిక నాయకులు వింత ప్రసాద్ రెడ్డి, పోతుల అప్పిరెడ్డి ముద్దన మురళి, ముల్లంగి శ్యామ్, హాస్పిటల్ ఛైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి, సొసైటీ ఛైర్మన్ రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్బు కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ తమ క్లబ్ అధ్యక్షురాలు వెంకట దుర్గావతి సూచనల మేరకు ప్రతినెలా వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని అన్నారు. ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు రోజురోజుకీ వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లుతుందని అన్నారు. వారు పౌష్టికాహారం తీసుకోవడం వలన శక్తి పెరిగి ఆరోగ్యంగా జీవిస్తారని అన్నారు. ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ మానవుని సేవలో తరిస్తే భగవంతుని మెప్పు లభిస్తుందని ప్రతి ఒక్కరూ సేవా నిరతిని పెంపొందించుకోవాలని అన్నారు. ఆ దిశగా కోరమండల్ మహిళా క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, మోహిని కుమారి, విజయలక్ష్మి, చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 12వ అదనపు జిల్లా జడ్జి పిఠాపురం వారి కోర్టులో
E.P. 1/2022 in O.S. 34/2018
Between:
చెన్న ప్రశాంత్ ...డిక్రీహోల్డర్
మరియు
కొంకిపూడి ప్రభాకరరావు మరియు అనదర్ ...జడ్జిమెంట్‌డెట్టార్స్
JDr-1 : కొంకిపూడి ప్రభాకరరావు, S/o. బుచ్చిరాజు హిందూ, వయస్సు 43 సం॥లు, వ్యాపారం, డో.నెం. 6-13-14/26ఎ, కొబ్బరితోట, తుని, తుని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధి
JDr-2 : కొంకిపూడి అరుణ, W/o. ప్రభాకరరావు హిందూ, వయస్సు 38 సం॥లు, డో.నెం. 6-13-14/26ఎ, కొబ్బరితోట, తుని, తుని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధి
నోటీసు
మీ దగ్గర నుండి రావలసిన డిక్రీ బకాయి వసూలు నిమిత్తము DHr దాఖలు చేసిన పై నెంబరు E.P. లో మీకు శ్రీ కోర్టువారు ఎన్ని పర్యాయములు నోటీసు పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పై నెంబరు గల E.P. **ది. 25-07-2023వ** తేదీన వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గానీ లేదా ప్లీడరు ద్వారా గానీ కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల పై E.P. మీకు పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
ఇది శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం జారీచేయబడిన నోటీసు.
పి.వి.ఎస్.ఆర్. మూర్తి, అడ్వకేట్
పిఠాపురం. ది.08-7-2023 డో.నెం. 4-2-133, కుచివారి వీధి, పిఠాపురం. సెల్: 9848006149

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE (JMFC) AT SRIKAKULAM.
O.S No. 106/2022.
Between:
Simma Suresh --Plaintiff.
And:
Moka V.V.S.N Prasad --Defendant.
To,
Defendant :
Moka V.V.S.N Prasad S/o not known, Hindu, aged about 50 years residing, L.I.G 1/21 A.P.H.B. Colony, Lalacheruvu, Rajahmundry, East Godavary District.
పై నెంబరు దావాలో మీకు నోటీసులు సర్వీస్ గానందున పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తం **తేది 07-08-2023న** వాయిదా యున్నది గనుక సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని లేదా అడ్వకేటు ద్వారా గాని కోర్టుకు పై **తేదిన ఉదయం 10.30 గం॥లకు** హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ పరుచు కొనవలెను. లేనియెడల మీపరోక్షమున విచారించి తీర్మానించడ మగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.
DUMPALA RAMANA RAO
ADVOCATES,SRIKAKULAM.
CELL: 9949291368.

మహారాజశ్రీ 4వ జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టు, కాకినాడ
I.A. 1107/2022, O.S. 651/2022
Between:
అడబాల సత్యనారాయణ, S/o. సత్తిరాజు, హిందు, వయస్సు 57 సం॥లు, ఎంప్లాయి, R/o. D.No. 2-256, సింహాద్రి నగర్, వలసపాకల, కాకినాడ రూరల్. *-పిటీషనర్/వాది*
AND
బొంతు రమేష్‌బాబు అండ్ అదర్స్ *-రెస్పాండెంట్స్/ ప్రతివాదులు*
R-1: బొంతు రమేష్‌బాబు, S/o. సూర్యనారాయణ, హిందు, వయస్సు 52 సం॥లు, ప్రోపర్టీస్, R/o. ప్రస్తుత నివాసం: యెదుర్లంక గ్రామం, ఐ.పోలవరం మండలం, తూర్పుగోదావరి జిల్లా. *-1వ రెస్పాండెంటు/ ప్రతివాది*
పై నెంబరు పిటిషనులో 1వ రెస్పాండెంటు/ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 24-7-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.శ్రీనివాసరావు
బి.శ్రీనివాస్
కాకినాడ, 08-7-2023 అడ్వకేట్స్, కాకినాడ

మహారాజశ్రీ 4వ జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టు, కాకినాడ
O.S. No. 651/2022
Between:
అడబాల సత్యనారాయణ, S/o. సత్తిరాజు, హిందు, వయస్సు 57 సం॥లు, ఎంప్లాయి, R/o. D.No. 2-256, సింహాద్రి నగర్, వలసపాకల, కాకినాడ రూరల్. *-వాది*
AND
బొంతు రమేష్‌బాబు అండ్ అదర్స్ *-ప్రతివాదులు*
D-1: బొంతు రమేష్‌బాబు, S/o. సూర్యనారాయణ, హిందు, వయస్సు 52 సం॥లు, ప్రోపర్టీస్, R/o. ప్రస్తుత నివాసం: యెదుర్లంక గ్రామం, ఐ.పోలవరం మండలం, తూర్పుగోదావరి జిల్లా. *-1వ ప్రతివాది*
పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 24-7-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.శ్రీనివాసరావు
బి.శ్రీనివాస్
కాకినాడ, 08-7-2023 అడ్వకేట్స్, కాకినాడ